



పాములపాడు మండలం ఇస్కాల వద్ద పొంగి పొర్లుతున్న భవనాసి వాగు, నీట మునిగిన నందుల దేవాలయం (ఫైల్)



మిడుతూరు గ్రామం వద్ద కాకిలేరు వాగు పొంగి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండగా కొట్టుకు పోతున్న గడ్డివాము, కారు, ట్రాక్టరు (ఫైల్)

ఇంకెన్నాళ్లు!

- వాగులు పొంగితే రాకపోకలు బంద్
- బయటి ప్రపంచంతో సంబంధాలు కట్
- అస్తవ్యస్తమవుతున్న జన జీవితం



కొత్తపల్లె మండలం లోని శివపురం గ్రామం వద్ద పెద్ద వాగు పొంగడంతో తాళ్ల సహాయంతో వాగు దాటుతున్న ప్రజలు (ఫైల్)

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : వాగులు పొంగాయంటే ఆ గ్రామాలకు రాక పోకలు నిలిచిపోతాయి. అత్యవసర వైద్యసేవలు అందవు. ఆ సమయాల్లో గర్భిణీలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తుల పరిస్థితి దుర్భరంగా తయారవుతుంది. ఈ గ్రామాలు ఎక్కడో అటవీ ప్రాంతాల్లో లేవు. నందికొట్కూరు నియోజకవర్గంలోని ఈ గ్రామాలు ఇప్పటికీ ఈ దుస్థితిలో ఉన్నాయి. నందికొట్కూరు నియోజకవర్గంలోని ఈ గ్రామాలలో రహదారుల వెంబడి, వాగుల వద్ద, వంకల వద్ద బ్రిటీష్ కాలం నాటి లో లెవెల్ బ్రిడ్జిలు, రాతి కట్టడాలు ఉన్నాయి. వడ్డెమాను, మిడుతూరు మండలాల్లోని చింతలపల్లె, మిడుతూరు, జూపాడు బంగ్లా మండలంలో పారుమంచాల, పాములపాడు మండలంలో ఇస్కాల గ్రామం, కొత్తపల్లె మండలంలోని శివపురం గ్రామస్తులు వర్షాకాలం వచ్చిందంటే ఆందోళన చెందుతారు. వాగులు పొంగాయంటే అటూ ఇటూ పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. కొన్ని గ్రామాలకు 10 నుంచి 20 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అప్పట్లో కొన్ని సంవత్సరాల క్రితంలో లెవెల్ బ్రిడ్జిలు, రాతి కట్టడాలు నిర్మించడంవల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వరదలు వస్తే కనీసం తెప్పలు వేసుకుని వెళ్లడానికి కూడా సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. భారీ తుఫాన్‌లకు మిడుతూరు గ్రామం సమీపంలో కాకిలేరు వాగు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. వాగులో ఓ కారు అదుపుతప్పి కొట్టుకుపోతుండగా గ్రామస్తులు ట్రాక్టర్ సహాయంతో తాళ్ళు కట్టి లాగేయడంతో ప్రమాదం తప్పింది.

నందికొట్కూరు మండలం: నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు సమీపంలో, అల్లూరు సమీపంలో వడ్డెమాను గ్రామంవద్ద వాగు పొంగితే వడ్డెమాను గ్రామానికి అల్లూరు, బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి సంబంధాలు తెగిపోతాయి.

కొత్తపల్లె మండలం: కొత్తపల్లె మండలంలోని శివపురం గ్రామం వద్ద పెద్ద వాగు పొంగడంతో అటువైపు వున్న సంగమేశ్వరం నుంచి సిద్ధేశ్వరం, మాడుగుల, ఎర్రమఠం, పెద్దగుమ్మడాపురం, చిన్న గుమ్మడాపురం, జడ్డు వారి పల్లె, భట్టు వారి పల్లె, శివపురం గ్రామ ప్రజలు తాళ్ళ సహాయంతో ప్రమాదకర స్థాయిలో పొంగి పొర్లుతున్న పెద్ద వాగును దాటాల్సి వస్తోంది. ఇటువంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అయ్యాయి.

జూపాడుబంగ్లా మండలం: జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామం సమీపంలో గల ఇసుక వాగు పొంగితే అటువైపు నుండి వెలుగోడు, వాడాల, తూడిచెర్ల, పారుమంచాల గ్రామస్తులు ఈ రోడ్డు వెంబడే రావలసి వుంది. ఇటువైపునుండి అన్నిరకాల రాకపోకలు బంద్ అవుతాయి.



జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఇసుక వాగు (ఫైల్)

పాములపాడు మండలం: పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలో భవనాసి నదికి వరదలు వస్తే ఇస్కాల గ్రామానికి రాకపోకలు ఆగిపోతాయి.

మిడుతూరు మండలం: మిడుతూరు మండలం కేంద్రం వద్ద లో లెవెల్ బ్రిడ్జి ఉన్నది. ఇక్కడ గ్రామంపై భాగాన గల తిప్పల నుంచి వర్షపు నీరు కాకి లేరు వాగులోకి ప్రవహిస్తుంది. ఈ వాగు పొంగితే పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. నంద్యాల జిల్లా కేంద్రానికి ఈ రోడ్డు వెంబడే వెళ్లాలి. వరదలు వస్తే ఆర్టీసీ బస్సులు నిలిచిపోతాయి. ఈ గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా, వైద్యం పొందాలన్నా కష్టతరంగా ఉంటుంది. విద్యార్థులు బడి మానుకోవలసి వస్తున్నది. బ్రిడ్జిలు, సరైన రోడ్లు నిర్మించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లు

- 300 ఎకరాల కేటాయింపునకు సీఎం అంగీకారం
- హర్షం వ్యక్తం చేసిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ త్వరలో డ్రోన్ హబ్‌గా మారనుంది. మంగళవారం అమరావతిలో జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా ఓర్వకల్లు మండలంలో డ్రోన్ హబ్ కోసం మూడు వందల ఎకరాలు కేటాయిస్తున్నట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వం ఓర్వకల్లును ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విమానాశ్రయం, రెండవ అతిపెద్ద సోలార్ పార్క్, పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. 2024 ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఓర్వకల్లు పారిశ్రామిక అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.2860 కోట్లు మంజూరు చేయించారని గౌరు చరిత కొనియాడారు. డ్రోన్ హబ్ వల్ల ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. టెక్నాలజీని అన్ని రంగాలకు అనుసంధానం చేస్తూ విప్లవాత్మక మార్పులకు సీఎం శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, వాటర్ పైపులైన్‌లో సాంకేతిక సమస్యల పరిశీలన, ప్రకృతి విపత్తుల్లో డ్రోన్ సాయంతో బాధితులకు సాయం అందించడం, రక్షణ రంగం, విద్య, వైద్యం ఇలా అన్ని రంగాల్లో డ్రోన్‌తో సేవలు పొందవచ్చని ఆమె అన్నారు.



భక్తుల శివనామస్మరణ నడుమ కొనసాగుతున్న స్వర్ణరథం

స్వర్ణ రథంపై మల్లన్న విహారం

శ్రీశైలం, అక్టోబరు 23: శ్రీశైలం మహాక్షేత్రంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి బుధవారం స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మల్లికార్జున స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వర్ణరథాన్ని పుష్పాలతో అలంకరించి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం ఆలయ మహా ద్వారం నుంచి నాలుగు మాడవీధుల్లో స్వర్ణరథోత్సవాన్ని భక్తుల శివనామస్మరణ నడుమ వైభవంగా జరిపారు. స్వర్ణ రథం ముందుకు సాగుతుండగా కోలాటం, జానపద కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి, అర్చకులు ఉత్సవాన్ని పర్యవేక్షించారు.



మాడవీధుల్లో స్వర్ణ రథోత్సవం

పెద్ద నాణెంపై చిన్న చూపు..! 6



- రూ.10 కాయిన్‌పై వదంతులు
- అవగాహన కల్పించినా అనాసక్తి

2 నుంచి శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు

- 16 రోజుల పాటు ఆర్జిత సేవలు నిలుపుదల 6



సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను గణనీయంగా నియంత్రించవచ్చని ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా అన్నారు. నంద్యాల పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లు, వ్యాపారస ముదాయాలకు సంబంధించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీసీఆర్‌కు అనుసంధానం చేసిన 250 కెమెరాల పని తీరును అడిగి తెలుసుకుని వాటిని పరిశీలించారు. కెమెరాల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.



నంద్యాలలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



ఘోరం

- మలిపెళ్లికి వెళుతూ పరలోకానికి..
- ఇన్నోవాను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలో ప్రమాదం
- ముగ్గురు కర్నూలు వాసులు మృతి

వివరాలు 7లో...

ఎస్సార్బీసీ సబ్ కెనాల్‌కు గండి

కోవెలకుంట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మండలంలోని గుంజలపాడు రహదారిలోని పదోబ్లాక్ ఎస్సార్బీసీ సబ్ కెనాల్‌కు బుధవారం గండిపడింది. ఈ కాల్వకు గండి పడడంతో కాల్వ వెంట వచ్చే నీరు పొలాల్లోకి ప్రవహిస్తోంది. వేసవికాలంలో కాల్వలను పర్యవేక్షించాల్సిన ఎస్సార్బీసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో సాగునీటి కాల్వలో ముళ్లకంపలు, పూడికలతో నిండిపోయాయి. ప్రస్తుతం వర్షాలకు తోడు ఎస్సార్బీసీకి నీటిని వదలడంతో పదోబ్లాక్ కాల్వ బలహీనమై గండిపడింది. దీంతో అమడాల , చింతకుంట, కోవెలకుంట్ల, పొట్టిపాడు, గుంజలపాడు గ్రామాల పరిధిలోని పంటలు నీట మునిగాయి.



పదో బ్లాక్ సబ్ కెనాల్ వద్ద గండిపడి వృథాగా పోతున్న నీరు

పోటెత్తిన వరద

కోసిగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని అగసనూరు గ్రామంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు బుధవారం భారీగా వరద నీరు పోటెత్తింది. టీబీ డ్యాం నుంచి 25 గేట్లు ఎత్తి తుంగభద్ర నదికి 1,12,136 క్యూసెక్కుల మేర నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఆర్డీఎస్ ఆనకట్టకు ఎగువ కురుస్తున్న వర్షాల వల్ల భారీగా నీరు చేరుతోంది. దీనికి తోడు తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల కావడంతో ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పోటెత్తుతోంది.



అగసనూరు గ్రామంలో ఆర్డీఎస్ ఆనకట్టపై పొంగి ప్రవహిస్తున్న వరద

పెద్ద నాణెంపై చిన్నచూపు..!

- రూ.10 కాయిన్‌పై వదంతులు
- అవగాహన కల్పించినా అనాసక్తి



మద్దికెర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పది రూపాయల నాణేనికి పెద్ద కష్టం వచ్చింది. ఆ నాణెం చెల్లదన్న అపోహ, వదంతులు ప్రజల్లో పాతుకుపోవడంతో ఆ నాణెం వినియోగంలో కనుమరుగైపోతోంది. నాణెం చెల్లదన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కొన్నేళ్లుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) శతవిధాలా ప్రయత్నిస్తున్నా సత్ఫలితాలు రావడం లేదు. రూ.10 నాణెలను తీసుకోవాలని, ఎవరూ నిరాకరించకూడదని ఆర్బీఐ స్పష్టం చేస్తోంది. ఎవరైనా చెలామణిని అడ్డుకుంటే శిక్షార్హులవుతారని కూడా ఇప్పటికే పలుమార్లు ఆర్బీఐ హెచ్చరించింది. ప్రస్తుతం వ్యాపారులు, పెట్రోల్ బంకుల నిర్వాహకులు రూ.10 నాణెం తీసుకోవడం లేదు. తమకు వచ్చిన నాణేలను తిరిగి ప్రజలకు ఇస్తే తీసుకోవడం లేదని వ్యాపారాలు చెబుతున్నారు. ఒక పక్క ఈ నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా వ్యాపారులు, ప్రజలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఆర్‌బీఐ రూ.10 నోట్ల స్థానంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది. కొంత కాలం ఈ నాణేలపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా వ్యాపారులు తీసుకునేందుకు విముఖత చూపుతున్నారు. ఇటీవల ఈ నాణెం చెల్లుబాటు అవుతుందని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంకు, ఆయా బ్యాంకు ఉన్నతాదికారులు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణేలను తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది.

వదంతులు నమ్మకండి



మార్కెట్‌లో రూ.10 అది చెల్లదనే అపోహ ప్రజల్లో బలంగా ఉంది. వందశాతం ఆ నాణెం చెల్లుబాటు అవుతుంది. వాస్తవానికి ఈ వదంతులు ఎలా మొదలైందో తెలియదు కానీ ప్రజల్లో మాత్రం చెల్లదంటూ వీక్షయ్యారు. అది ఎంతమాత్రం సబబు కాదు. కూరగాయల వ్యాపారులు, చిన్న చిన్న హోటళ్లు, బజ్జీ కొట్టు వద్ద రూ.10 నాణెం చెల్లదనే అపోహ పెట్టుకోవద్దు. రూ.10 నాణెం తీసుకోవాలని మేము కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరపత్రాల ద్వారా ప్రజలకు వివరిస్తాం.

- జి.వెంకటేశ్‌గౌడు, కెనరా బ్యాంకు మేనేజర్, మద్దికెర

ప్రజలకు అవగాహన కల్పించాలి



రూ.10 నాణెం చెల్లుతుందని బ్యాంకర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలి. రూ.10 నాణెం మేము తీసుకుంటున్నాం. మా వద్ద నుంచి తీసుకోవడానికి ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నాణెంపై సభలు పెట్టి లేకపోతే దండోరా ద్వారా ప్రజలకు వివరించాలి. అప్పుడే నాణేలపై ప్రజలకు అవగాహన వచ్చి తీసుకుంటారు.

- ముత్యాల రాజశేఖర్, మద్దికెర

పల్లెల్లో దండోరా వేయించాలి :




గ్రామీణ ప్రాంతాల్లో నేటి వరకు రూ.10 నాణెం అంటే చెల్లదనే అపోహ ఉంది. రూ.10 నాణేం చెల్లుతుందని విస్తృత ప్రచారం చేయాలి. బ్యాంకర్లు దండోరా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. మేము వేరే వారికి పది రూపాయల నాణెం ఇచ్చేందుకు వెళ్తే వారు తీసుకోవడం లేదు. ఇలా ఉంటే ఎవరికైనా అనుమానం వస్తుంది.

- విజయలక్ష్మి, కొత్తపల్లి

కాయిన్ కాదంటే చెరసాలే..!

ఆర్బీఐ పది రూపాయల నాణేలు నిషేధించిందని, నకిలీవి పుట్టుకొచ్చాయని వచ్చిన వదంతులను నమ్మకూడదు. రూ.10కాయిన్‌లను తిరస్కరిస్తే చెరసాలే. వాటిని వస్తు క్రయ విక్రయాలు, బ్యాంకు ఖాతాల్లోనూ డిపాజిట్ చేసుకోవచ్చు. ఎవరైనా సరే నాణేలను స్వీకరించకపోతే 2011 సెక్షన్ 61 ప్రకారం చట్ట ఉల్లంఘన కింద పరిగణిస్తారు. ఆర్బీఐ 2005 నుంచి రూ.10 నాణేలను అందుబాటులోకి తెచ్చింది. వివిధ రూపాల్లో ఇవి ప్రజల దరి చేరాయి.





బాబోయ్.. ఇవేం ధరలు..?



చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యులు కొనలేనంతగా ధరలు పెరిగాయి. దీంతో కిలో కొనేవాళ్లు అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. చాగలమర్రి మార్కెట్‌లో బుధవారం చిక్కుడు కాయలు కిలో రూ.100, బీన్స్ కిలో రూ.140, క్యారెట్ రూ.100, క్యాప్సికం కిలో రూ.100, బెండకాయలు రూ.80, వంకాయలు రూ.80, బంగాళ దుంపలు రూ.80, కాకరకాయ రూ.100, పచ్చిమిర్చి 80 నుంచి రూ.100, చౌళేకాయలు రూ.80, టమోటా రూ.60, అల్లం కిలో రూ.120, అనందలు కిలో రూ.100, మునగ కిలో రూ.160 ధర పలుకుతుండటంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చొరవ తీసుకుని కూరగాయల ధరలను అదుపు చేసి ఆదుకోవాలని పేద, మధ్యతరగతి ప్రజలు కోరుతున్నారు.

మల్లికార్జునస్వామికి వెండి సమర్పణ

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన అద్దంకి నరసింహారావు, హరిత వెండి వస్తువులను సమర్పించారు. ఇందులో 995 గ్రాముల బరువుగల రెండు వెండి బిందెలు, 1.665 కిలోల గంధాక్షరి గిన్నెలను అందజేశారు. వీటిని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో పర్యవేక్షకులు కె. అయ్యన్న, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, గుమస్తా సావిత్రికి దాతలు అందజేశారు. అనంతరం దాతకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేసి స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



విరాళంగా అందజేసిన వెండి వస్తువులు

నర్సుల ఎన్నికల్లో శాంతి భవానీ ప్యానల్ విజయం

- అధ్యక్షురాలిగా ఎం.లీలావతి, కార్యదర్శిగా సి. బంగారి
- అభినందనలు తెలిపిన ఏపీఎన్జీవో, టీఎన్‌టీయుసీ నాయకులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏపీఎన్జీవో, టీఎన్‌టీయుసీ బలపరిచిన శాంతిభవానీ ప్యానల్ అన్ని పోస్టుల్లో ఘన విజయం సాధించింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జిల్లా ఎన్నికల అధికారి బి. చెన్నమ్మ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. 321 మంది సభ్యులు ఉండగా.. 270 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు పోలీసు బందోబస్తు ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియ రాత్రి 8.30 గంటల వరకు సాగింది. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి విజేతలను ప్రకటించి వారికి డిక్లరేషన్ ఫామ్‌లను అందించారు. అధ్యక్ష పదవికి మండ్ల లీలావతికి 160 ఓట్లు రాగా, ఆదిలక్ష్మికి 98 ఓట్లు వచ్చాయి. కార్యదర్శి పదవికి సి. బంగారికి 152 ఓట్లు రాగా, డి. మంజులదేవికి 112 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షురాలిగా జి. శాంతిభవానికి 162 ఓట్లు రాగా, శ్రీదేవికి 97 ఓట్లు వచ్చాయి. కోశాధికారి పోస్టుకు ఎన్. లక్ష్మినరసమ్మ (గోనెగండ్ల పీహెచ్‌సీ)కి 143 ఓట్లు రాగా, జి.విజయమ్మకు 119 ఓట్లు వచ్చాయి. ఈసీ సభ్యులుగా ఎస్.సోమేశ్వరి, డి. కృష్ణవేణి, జే. ఉమారాణి, యుఎం శాంతిలత, ఏ.ఉమాదేవి గెలిచారు. గెలిచిన శాంతిభవాని ప్యానల్‌కు ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, తెలుగునాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు మాధవరాజు, చంద్రశేఖర్ నాయుడు అభినందనలు తెలిపారు.



ప్యానల్‌ను అభినందిస్తున్న ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి

కర్నూలు వాసికి అరుదైన అవకాశం

- ఖలీద్ సైపుల్లాకు కాంగ్రెస్‌లో కీలక పదవి



కర్నూలు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను గుర్తించి కాంగ్రెస్ అల్ ఇండియా డేటా, టెక్నాలజీ (ఐఎన్‌సీ)విభాగానికి వైస్ చైర్మన్‌గా ఖలీద్ సైపుల్లాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. కర్నూలు నగరానికి చెందిన ఖలీద్ 20 సంవత్సరాలకు పైబడి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. గూగుల్, ఇన్ఫోస్కో, నెస్, డేల్ వంటి ప్రముఖ సంస్థల్లో ఆయన పని చేశారు. డేటా శిక్షణ, టెక్నాలజీస్‌పై ఆయనకు అపారమైన అనుభవం ఉంది. ఆయన రూపొందించిన మిస్సింగ్ ఓటర్ల యాప్, ఉచిత రేషన్, ఉచిత ఆక్సిజన్ యాప్ లాంటి కార్యక్రమాలు సీఎన్ఎన్, బీబీసీ, ఫారిన్ పాలసీ, బిజినెస్ స్టాండర్డ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఎన్‌డీటీవీలో ప్రసారమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకంపై సంతోషం వ్యక్తం చేశారు. లోక్ సభ ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ, ఐఎన్‌సీ డేటా అండ్ అనలిటిక్స్ విభాగం చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ నేపథ్యం లేని వారు కూడా ప్రజా సేవల పట్ల ఆసక్తి ఉంటే కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధి సాధించడానికి, మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాగా డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ, నగర అధ్యక్షుడు జిలాని బాషా, మహిళా విభాగం అధ్యక్షురాలు వెంకట సుజాత తదితరులు ఖలీద్‌కు అభినందనలు తెలిపారు.

సీఎంవో ఆదేశాలతో నిధులు



ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఆదోని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో గణేకల్లుతో పాటు అయిదు గ్రామాల ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు అధికారులు నిధులు మంజూరు చేశారు. ఈనెల 18వ తేదీన గ్రామానికి చెందిన విరూపాక్షి, రంగస్వామి, బంగారయ్య అమరావతిలో సీఎంవో ప్రజాపరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. నూతన పైపులైన్ ఏర్పాటుకు జీఓ నెం. 918 ద్వారా రూ.566.90 కోట్లు మంజూరైనట్లు టెండర్లు పిలిచి పనులు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ మధు తెలిపారు. అయితే పనులు త్వరగా చేయాలని గ్రామస్థులు ఏఈకి వినతిపత్రం ఇచ్చారు.

2 నుంచి శ్రీశైలంలో కార్తీక ఉత్సవాలు



16 రోజుల పాటు ఆర్జిత సేవలు నిలుపుదల

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీకమాసోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ రోజులు శని, ఆది, సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి, సెలవురోజుల్లో స్వామివారి స్పర్శదర్శనాలు, గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రత్యేక రోజుల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే ఉంటుందన్నారు. రెండు విడతలుగా ఆర్జిత హోమాలు నిర్వహించనున్నారు. సాధారణరోజులు మొత్తం 14 రోజులలో స్వామివారి స్పర్శదర్శనాలు, సామూహిక అభిషేకాలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. భక్తులు దర్శనం టిక్కెట్లను దేవస్థానం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని పేర్కొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పిల్లర్‌కు మరమ్మతులు



కర్నూలు కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మునగాలపాడు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పిల్లర్ కూలడానికి సిద్ధంగా ఉందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఎప్పుడైనా కూలవచ్చు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కలెక్టర్ మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్‌ను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో బుధవారం ఐరన్ కడ్డీలు సిద్ధం చేసి, నిర్మాణ మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

నిర్మాణానికి ఐరన్ కడ్డీలు సిద్ధం చేస్తున్న ఇంజనీర్లు

బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే!



ఇదేదో రంజీ ట్రోఫి టోర్నమెంట్ కాదు. ఇంటర్నేషనల్ టెస్ట్ మ్యాచ్ అంతకన్నా కాదు. యంగ్ క్రికెటర్ రవీంద్ర జడేజా స్టైల్‌లో క్రికెట్ ఆడుతున్న ఆయన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు. బుధవారం పత్తికొండలో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులు, పోలీసుల జట్లు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా పోలీసుల టీం తరపున ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొని బౌలింగ్, బ్యాటింగ్ చేశారు. కాసేపు రాజకీయాలను పక్కన పెట్టి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రౌండ్‌లో క్రికెట్ ఆడారు.

-పత్తికొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

బంతి పూల ధర పతనం


చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో పూల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని చాగలమర్రి మండలంలో బంతిపూలను సాగు చేశారు. దసరా తరువాత ధరలు తగ్గి రైతులకు నష్టాలు మిగిల్చాయి. గొడిగనూరు, ఎం.తండా తదితర గ్రామాల్లో బంతిపూలను విస్తారంగా సాగు చేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న తుఫాన్‌తో పూసిన పూలన్నీ కుళ్లి పోతున్నాయి. వారం రోజుల కిందట కిలో రూ.100 పలికిన ధర పతనమైంది. కిలో రూ.10 కూడా కొనేవారు లేక నేల చూపులు చూస్తోంది. చాగలమర్రి గ్రామంలో సాదిక్‌హుసేన్ అనే రైతు సాగు చేసిన బంతిపూల తోట దెబ్బతింది. అర ఎకరాకు రూ.20 వేలు ఖర్చు చేసిన పైసా కూడా రాలేదు. కిలో రూ.10లకు విక్రయిస్తామన్నా కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. పెట్టిన పెట్టుబడి రాక తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైతు సాదిక్ హుసేన్ / విరగ్గాసిన బంతిపూలు

నిండుకుండలా జలాశయం

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం భారీగా కొన సాగుతోంది. దీంతో డ్యాం నిండు కుండలా కళకళలాడుతోంది. బుధవారం జూరాల నుంచి 37,343 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,05,175 క్యూసెక్కులు మొత్తం 1,42,518 వరద వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,05,547 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటిమట్టం 884.50 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,253 క్యూసెక్కులు, తెలంగాణ విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రాంరభమయ్యాయి. బుధవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 17 పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్ 3,688, సప్లిమెంటరీ 1,513 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 3943 మంది హాజరై పరీక్షలు రాశాలని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆత్మ పీడీగా రత్నప్రసాద్ నియామకం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మ ప్రాజెక్టుకు జేడీ స్థాయి అధికారిని డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు కర్నూలు జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా రత్నప్రసాద్ నియమితులయ్యారు. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న రత్నప్ర సాద్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. ఈ పోస్టు కర్నూలులో రెండేళ్లుగా ఖాళీగా ఉంది. త్వరలోనే పూర్తి స్థాయిలో ఆత్మ ప్రాజెక్టును పునర్నిర్మించి రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకు వస్తామని ఆయన తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. Www.pministernship.mca.gov.in ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25 వరకు అవకాశం ఉంది. దేశంలోని 400 అగ్రగామి కంపెనీలలో 12 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసింది. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారు పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వయస్సు 21 నుంచి 24 మధ్య ఉండాలి. ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌తో ఈకేవైసీ పూర్తి చేయాలి. చిరునామా, కేటగిరి, ఈ మెయిల్ ఐడీ బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేయాలి.

రేపు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నందికొట్కూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం, గోసంరక్షణ, వాననీటి సంరక్షణలపై అవగాహన సదస్సును 25న జూపాడుబంగ్లా మండలం పారుమంచాల శివక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ప్రచారకుడు విజయ్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వందమందిలోపు రైతులు మాత్రమే పాల్గొంటారని, ఆసక్తి గల రైతులు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు నోట్ ప్యాడ్, పెన్, బట్ట సంచి, స్టీల్ ప్లేట్, వాటర్ బాటిల్‌తో హాజరు కావాలని సూచించారు. ఈ సదస్సులో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులతో చేసిన భోజన సదుపాయం ఉంటుందన్నారు.

లా 5,7,9 సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ లెజిస్లేటివ్ లాస్ (లా) 5,7,9 సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. బుధవారం పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెగ్యులర్, సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశామని, మరిన్ని వివరాలకు వర్శిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పెర్కొన్నారు.

ఎస్సార్బీసీ కాల్వలో పడి మహిళ మృతి

బనగానపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యో తి): బనగానపల్లె పట్టణం తమ్మడపల్లె రహదారిలోని ఎస్సార్బీసీ కాల్వలో పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి బుధవారం తెలిపారు. తమ్మడపల్లె రహదారిలోని ఎస్సార్బీసీ సబ్ కాల్వలో మృతదేహాన్ని కనుగొన్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతి చెందిన మహిళకు సుమారు 35 ఏళ్లు ఉంటాయ ని, ఎర్రటి పావడ, నలుపు రంగు జాకెట్ ధరించి దని తెలిపారు. మహిళ ఆనవాళ్లు గుర్తించినట్లయితే 9221101124, 9121101042 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

తిరుమల ఘాట్ రోడ్డులో కర్నూలు వాసులకు గాయాలు

తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ఓ టాటా సుమో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కర్నూలు నగరానికి చెందిన 8 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. కర్నూలుకు చెందిన శివ, సంజయ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుమలకు వచ్చారు. స్వామి దర్శనం పూర్తి చేసుకుని బుధవారం ఉదయం తిరుమల నుంచి ప్రైవేట్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 24వ మలుపు వద్ద వాహనం ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో శివ, సంజయ్‌తో సహా కుటుంబ సభ్యులు, డ్రైవర్ హేమంత్ స్వల్పంగా గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ తెలిపారు.

వలస కూలీ మృతి

ఆస్పరి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐనేకల్లు గ్రామానికి చెందిన మౌనిక (23) తన భర్త గోవిందుతో బతుకుదెరువు కోసం తిరుపతికి వెళ్లి ప్రమాదవశాత్తు మంగళవారం మృతి చెందింది. రెండు నెలల క్రితం తిరుపతిలో భవన నిర్మాణ పనులు చేసేందుకు గ్రామం వదలి వెళ్లారు. పనులు చేస్తుండగా, కంకర మిషన్‌లో పడి మౌనిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికంగా వ్యవసాయ పనులు లేకపోవడంతో వలస వెళ్లారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మౌనిక మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

దేవనకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పత్తికొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కూరగాయల లారీ మంగళవారం రాత్రి కరిడికొండ బస్ స్టేజీ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఎదురుగా బస్సు వేగంగా లారీ వైపు దుసుకురావడంతో ప్రమాదాన్ని తప్పించబోయి లారీ అదుపు తప్పింది. ప్రమాదంలో క్లీనర్ కార్తీక్, తుగ్గలి మండలం పెరవలి గ్రామానికి చెందిన రైతు ఇస్మాయిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో, వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.



బోల్తా పడిన కూరగాయల లారీ

మలిపెళ్లికి వెళుతూ పరలోకానికి..

- ఇన్నోవాను ఢీకొన్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు
- రైల్వేకోడూరు సమీపంలో ప్రమాదం
- ముగ్గురు కర్నూలు వాసుల మృతి

రైల్వే కోడూరు / కర్నూలు క్రైమ్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి) : రైల్వేకోడూరు మండ లంలోని ప్రధాన దారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన ముగ్గు రు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాల య్యాయి. మలిపెళ్లికి వెళుతుండగా ఈ ఘటన జరగ డంతో పెళ్లింట విషాదం నెలకొంది. వివరాలు ఇలా.. షరాఫ్ బజారుకు చెందిన గురువయ్యకు ముగ్గురు కొడుకులు సంతానం. పెద్ద కొడుకు రాజేష్ కూతురు సిరిచందన పెళ్లి ఈ నెల 20న దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న ఓ ఫం క్షన్ హాలులో జరిగింది. పెళ్లి రిసెప్షన్ తిరుపతి లో ఉండడంతో గురువయ్య కుటుంబ సభ్యులు, వారి బంధువులు కార్లలో బయలుదేరారు. సా యంత్రం 5గంటల సమయంలో రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలోని రాజానగర్ ప్రధాన రహదారిలో తిరుపతి నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు పెళ్లి వారి ఇన్నోవా వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇన్నోవాలో ఉన్న రాజేశ్వరి, లలితమ్మ, ఉపేంద్ర, మహేశ్, ప్రేమ్‌కుమార్, సుచిత్ర, వాసవిలు తీవ్రంగా గాయపడ్డారు. వీరికి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం తిరుపతిలోని అమర ఆసుపత్రికి తరలించారు. తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రేమ్‌కుమార్ (45), వాసవి (51), సుచిత్ర (45) మృతి చెందారు. విష యం తెలుసుకున్న తిరుపతిలోని బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న కడపకు చెందిన ప్రభాకర్, మహ్మద్ గాయపడ్డారు. రోడ్డు ప్రమాదం సమాచారం తెలుసుకు న్న రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని సహా యక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఆర్టీసీ ఎలక్ట్రిక ల్ బస్సు ముందు భాగం దెబ్బతింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వేకో డూరు సీఐ హేమసుందర్‌రావు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు



మృతి చెందిన సుచిత్ర

మృతి చెందిన వాసవి

మృతి చెందిన ప్రేమ్‌కుమార్

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఆటో ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

- నలుగురికి గాయాలు

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 23: మండలంలోని అమడగుంట్ల-చిల్లబండ గ్రామాల మధ్యన మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గోరంట్ల గ్రామానికి చెందిన బోయ పర్ల సత్యం మరికొందరు బేల్దారి పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మంగళవారం కర్నూలులో పనులకు వెళ్లి రాత్రి ఆలస్యంగా ఆటోలో బయలుదేరారు. అయితే అమడగంట్ల గ్రామం దాటిన తర్వాత ఎదురుగా ఉల్లిగడ్డల లోడుతో వస్తున్న ట్రాక్టర్.. వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బోయ పర్ల సత్యం (38) అక్కడికక్కడే మృతి చెందాడు. గిడ్డయ్య, నాగరాజు అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఆటోలో, ట్రాక్టర్‌లో ఉన్న వ్యక్తులది గోరంట్ల గ్రామమే. గ్రామస్థులు పెద్ద ఎత్తున ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వీరిలో గిడ్డయ్య పరిస్థి తి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు సత్యం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య చంద్రకళ, కూతురు, కొడుకు ఉన్నారు. ఎమ్మెల్యే దస్తగిరి బుధవారం మధ్యాహ్నం కోడు మూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని బాధితుల ను పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు సర్పంచ్ బాలక్రిష్ణ, కున్నూరు మధు, యల్లప్ప, రవీంద్ర పాల్గొన్నారు.



పర్ల సత్యం (ఫైల్)

లోక్ అదాలత్‌లో బాధితుడికి న్యాయం

కర్నూలు లీగల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): శాశ్వత లోక్ అదాలత్ జోక్యంతో ఓ బాధితుడికి న్యాయం దక్కింది. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలానికి చెందిన కె.మహేశ్వర రెడ్డి తన ఇంటి పత్రాలను తాకట్టు పెట్టి రంగాపురంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ నుంచి హౌస్ లోను తీసుకున్నాడు. ఆ తర్వాత లోన్ మొత్తాన్ని 2022, అక్టోబరు 15న చెల్లించేశాడు. అయితే బ్యాంకు అధికారులు ఫిర్యాది ఇంటి పత్రాలను వాపసు చేయకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఇంటి తనఖాను రద్దు చేయలేదు. దీంతో ఫిర్యాది తన న్యాయవాది పి.శివసుదర్శన్ ద్వారా శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. రిజర్వు బ్యాంకు నియమావళి ప్రకారం ఫిర్యాదికి రోజుకు రూ.5 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో కేసును విచారించిన శాశ్వత లోక్ అదాలత్ బ్యాంకు అధికారులను కోర్టుకు పిలిపించి ఇరు వర్గాలకు ఆమోదయోగ్యకరమైన పరిష్కారాన్ని చూపించారు. ఈ మేరకు బ్యాంకు అధికారులు ఫిర్యాదికి నష్టపరిహారంగా రూ.85 వేలు చెల్లించి ఇంటికి సంబంధించిన సర్టిఫైడ్ కాపీ పత్రాలను వాపసు చేయడానికి అంగీకరించారు. శాశ్వత లోక్ అదాలత్‌లో సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజబాబులు ఇరువర్గాలను రాజీ మార్గం ద్వారా కేసును పరిష్కరించేందుకు కృషి చేసినట్టు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ తెలిపారు.

● మరొక కేసులో ఏటీఎంలో చినిగిపోయిన రూ.500 నోటుకు బదులుగా కొత్త నోటును ఇవ్వడానికి తిరస్కరించిన స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య వచ్చిన వివాదాన్ని శాశ్వత లోక్ అదాలత్ పరిష్కరించింది. ఫిర్యాది ఎం.హేమం తేశ్వర మునిరాజు ఈ ఏడాది అక్టోబరు 2న గాయత్రీ ఎస్టేట్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం నుంచి తన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు డ్రా చేశాడు. అందులో చినిగిపోయిన రూ.500 నోటు వచ్చింది. దీంతో ఫిర్యాది బ్యాంకు అధికారులకు ఆశ్రయించి తన నోటు ను బదిలీ చేయాలని కోరారు. దీనికి బ్యాంకు అధికారులు తిరస్కరించారు. దీంతో బాధితుడు లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. బ్యాంకు అధికారులను శాశ్వత లోక్ అదాలత్ పిలిపించి ఫిర్యాదికి కొత్త రూ.500 నోటును ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది.

మహానందిలో వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడి పూజలు

మహానంది, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు మిలిన్ పరండే ప్రత్యేక పూజలు నిర్వహించా రు. బుధవారం ఆలయ ముఖ ద్వారం వద్ద వీరికి ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యం లో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు జరిపారు. పూజల అనంత రం కల్యాణ మండపంలో వీరిని ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శాల్వాతో సన్మానించి, స్వామివారి మెమెంటోను అందజేశారు. వీరి వెంట వీహెచ్‌పీ దక్షిణ భారత కార్యదర్శి శ్యాం సత్యంజీ, క్షేత్ర అధ్యక్షులు సాయిరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ప్రముఖులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రమౌళీశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. మహానంది ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాని జాతీయ అధ్యక్షుడు మిలిన్‌పరండేను ఆలయ ఈవో కోరారు.



మిలిన్ పరండేకు స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఈవో

పోలీసుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సి. బెళగల్, అక్టోబరు 23 ఆంధ్రజ్యోతి: పోలీసుల వేధింపులు తాళలేక తిమ్మనదొడ్డి గ్రామానికి చెందిన నర్సన్న బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ నెల 5న గ్రామానికి చెందిన లక్ష్మన్న, తిమ్మయ్య హమాలీ డబ్బు పంపకంలో ఘర్షణ పడ్డారు. నర్సన్న కుమారుడైన లక్ష్మన్న ఆగ్రహంతో తిమ్మయ్య ఇంటికి వెళ్లి నానాదుర్భాషలాడాడు. దీంతో రాముడు అనే వ్యక్తి కుమారులైన తిమ్మయ్య, నాగేష్ తదితర కుటుంబ సభ్యులు తమపై నర్సన్న, లక్ష్మన్న దాడి చేశారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో పోలీసులు వేధించడంతో నర్సన్న పురుగుమందు తాగాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పురుగుల మందు ఎందుకు తాగవని వైద్యులు నర్సన్నను అడిగితే పోలీసులు వేధించడంతో తాళలేక పురుగుమందు తాగినట్లు వైద్యులకు తెలిపినట్లు సమాచారం. దీనిపై ఎస్ఐ తిమ్మారెడ్డిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, రెండు రోజులుగా స్టేషన్‌లో లేనని వివరణ ఇచ్చాడు. రాముడు కుమారులైన నాగేష్, తిమ్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం: ఎంపీ

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉంటామని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో కలిసి పర్యటించారు. ఉల్లిగడ్డలు విక్రయానికి తెచ్చిన రైతులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర అందుతుందో లేదోనని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు గిట్టుబాటు ధర అందించాలని సెక్రటరీ జయలక్ష్మిని ఆదేశించారు. యార్డులో రైతులకు అవసరమైన వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్, సూపర్ వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న పాల్గొన్నారు.



కర్నూలు మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పొడిగింపు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారి పదవీ కాలం ఈ నెలతో ముగుస్తుండటంతో మరో ఆరు నెలలపాటు వారి పొడిగిస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికార వర్గాలు తెలిపాయి. 2018లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలక వర్గాలకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిం చింది. ఆ తర్వాత వివిధ కారణాలతో ఎన్నికలను వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

నేటితో ముగియనున్న ఇసుక టెండర్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇసుక టెండర్ల గడువు గురువారంతో ముగియనుంది. 28న జాయింట్ కలెక్టర్ సమక్షంలో టెండర్లు దక్కించుకున్న వారికే ఇసుక తవ్వకాలు, రవాణ బాధ్యతలను కట్టబెట్టనున్నారు. జిల్లాలో మరళీ ఇసుక రీచ్‌కు టెండర్లు పిలిచారు. 72,135 టన్నుల ఇసుక తవ్వకాలు, స్టాక్ పాయింట్‌కు రవాణా కలిపి టన్నుకు రూ.110 నిర్ణయించారు. ఈ టెండర్లలో దాదాపు 14 మంది సీల్డ్ బాక్స్‌లో టెండర్లు వేసినట్లు సమాచారం. వారిలో కొద్ది మంది ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కోట్ చేయకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. 2019లో టన్నుకు రూ.145 దాకా వేసి దక్కించుకుని పనులు చేశామని, ప్రస్తుత నిర్ణయించిన ధర గిట్టుబాటు కాదంటూ సిండికేట్‌గా ఏర్పడి దక్కిం చుకోవాలనే వ్యూహం పన్నినట్టు తెలుస్తోంది. ఈ మేరకు టెండర్స్ అధిక ధరకే కోట్ చేసినట్లు సమాచారం. కాగా పారదర్శకంగా టెండర్లు జరుగుతాయని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్ర పేర్కొన్నారు.

గోరుకల్లు తండాలో పారిశుధ్య లోపం



డ్రైనేజీలో నిలిచిన మురుగు

● డ్రైనేజీల్లో నిలిచిన మురుగు
● దోమకాటుతో రోగాల బారిన గిరిజనులు

పాణ్యం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమెట్ట పంచాయతీ మజరా గ్రామమైన గోరుకల్లు తండాలో పారిశుధ్యం లోపించింది. గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం ముంపుతో పాణ్యం పరిధిలోని ఎస్సార్బీ కాలువ సమీపంలో నిర్మించిన పునరావాస గ్రామమైన ఈ తండాలో 110 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచి దోమలకు నిలయంగా మారిందని ప్రజలు అంటున్నారు. దోమల కారణంగా జ్వరాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. వీధిదీపాలు వెలగడంలేదన్నారు. రాత్రివేళల్లో పాములు, తేళ్లతో భయానకంగా ఉందని చెబుతున్నారు. ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించామన్నారు. కాలనీ నుంచి సమీప వాగులోకి మురుగు తీసుకువెళ్లేలా ప్రణాళికలు తయారు చేయాలని కోరుతున్నారు. కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టి కాలనీవాసుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

మురుగును తొలగించాలి



గోరుకల్లు తండాలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగు బయటికి వెళ్లేలా చర్యలు చేపట్టాలి. కాలనీలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలి.

- థావుర్యానాయక్

వీధి దీపాలు వెలగడం లేదు



కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. కాలనీ ప్రారంభంలో ప్రభుత్వం సోలార్ దీపాలు ఏర్పాటు చేసింది. కాగా సోలార్ దీపాలు, బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో గ్రామ పంచాయతీ వీధి దీపాలు ఏర్పాటు చేసింది. గత కొంత కాలంగా వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి.

- చంద్ర నాయక్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: డీఎస్పీ



పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఆత్మకూరు డీఎస్పీ

జూపాడుబంగ్లా, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు డివిజన్ పరిధిలో నేరాలు, దొంగతనాలు బాగా తగ్గాయని, రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ అన్నారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. పోలీసుస్టేషనులో ఉన్న మరుగుదొడ్లు, బందీఖానాలు, రికార్డుల గదులను పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గాలేరు నగరిలో పడిన 40 బర్రెలు

● సత్వర చర్యలతో సురక్షితంగా బయటకు..



గాలేరు నగరిలో కొట్టుకుపోతున్న బర్రెలు

పాణ్యం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమెట్ట సమీపంలో బర్రెలు ప్రమాదవశాత్తు గాలేరునగరి కాలువలో పడ్డాయి. బుధవారం సుగాలిమెట్టకు చెందిన కాపరులు 40 బర్రెలు మేపడానికి సమీప కొండకు వెళ్లారు. ఎండ తీవ్రతకు బర్రెలు సమీప కాలువలోకి నీరు తాగడానికై కాలువలో దిగడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో కాపరులు కాలువ వెంట దాదాపు 20 కిలోమీటర్లు వెళ్లారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితకు సమాచారం ఇచ్చినట్లు టీడీపీ నాయకుడు కె. చంద్రానాయక్ తెలిపారు. ఆమె వెంటనే గాలేరునగరి ఎస్ఈ వరప్రసాద్‌కు సమాచారం అందించడంతో కాలువ గేట్లు మూసివేసి నీటిని తగ్గించడంతో బనగానపల్లె మండలం రామతీర్థం, చెరువుపల్లె మధ్య బర్రెలు బయటికి వచ్చినట్లు తెలిపారు. ఘటనా సమయంలో కాలువలో 6500ల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండడంతో ప్రవాహ వేగానికి బర్రెలు కొట్టుకుపోయినట్లు తెలిపారు. ఉదయం 12 గంటలకు కొట్టుకుపోయిన బర్రెలు సాయంత్రం 5 గంటలకు బయటికి వచ్చినట్లు పాడి రైతులు తెలిపారు. నిత్యం కాల్వ సమీపంలో మేతకు వెళ్లే పాడిపశువులు కాల్వ దాటడానికి స్లూయిజ్ ఏర్పాటు చేయాలని గత కొంత కాలంగా అధికారులను కోరినట్లు తెలిపారు.

పొగాకు పంటల పరిశీలన

నంద్యాల రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్ఏఆర్ఎస్ దత్తత గ్రామమైన పులిమద్ది గ్రామంలోని పొగాకు పంటలను బుధవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొగాకులో ఆకులు వడలి పోవడం, నల్లకాడ తెగులు వస్తోందని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, పులిబాయి తెలిపారు. పొగాకులో ఆకులు వడలి పోయినచో 19-19-19 మందును లీటరు నీటిలో 5 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిదంగా నల్లకాడ తెగులు నివారణ కోసం రిడోమిల్ గోల్డ్ లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పొగాకులో వచ్చే కప్పకన్ను తెగులు నివారణకు డైపేనకొనజోల్ లేదా ప్రోపికొనజోల్ లీటరునీటిలో 1గ్రాము, లద్దెపురుగు నివారణకు కోరాజోన్ 0.4 ఎంఎల్, స్పినోసైడ్ 0.2 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు.

'తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి'

పాములపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మినుము పంటలో ఆకు ముడత తెగులు నివారణకు కార్‌టాప్ హైడ్రా క్లోరైడు ఎకరానికి 8 కేజీలు వాడాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ సూచించారు. జూటూరు, పాములపాడు గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయాధి కారి ఫణీశ్వరరెడ్డి అధ్యక్షతన పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత మాట్లా డుతూ మినుము పంటలో సోకే తెగుళ్ల, వాటి నివారణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరాంచారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'నట్టల నివారణపై అవగాహన కల్పించాలి'

పాములపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గొర్రెల్లో నట్టల నివారణపై రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధశాఖ డీడీ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. రుద్రవరంలో బుధవారం గొర్రెల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి నట్టల మందులు పంపిణీ చేశారు. అనంతరం పాములపాడు పశువైద్యశాలలో రికార్డు లను పరిశీలించారు. పశువైద్యాధికారి అనిల్, సిబ్బంది, పాల్గొన్నారు.

నవంబరు 30లోపు పూర్తి చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 211 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, రీసర్వేపై వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతఇచ్చి శ్రద్ధగా దిద్దుబాటు పనులను నవంబరు 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అంశాలపై బుధవారం రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ జిల్లాలో ఏడు జాతీయ రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, భూసేకరణ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీఎంవో కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని పెండింగ్‌లో ఉన్న 9 సమస్యలను పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులలో రెవెన్యూ శాఖకు సంబంధించి 630దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, బియాండ్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో 14,280 ఎకరాలకు సంబంధించిన ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి స్వయం సంతకాల ప్రతులను అందజేయాలన్నారు. జేసీ విష్ణుచరణ్ 261 సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా వచ్చేనెల 6వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. డీఆర్వో పద్మజ, ఆర్డీవోలు పాల్గొన్నారు.

● నంద్యాలలోని మున్సిపల్ టౌన్‌హాలును ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని కలెక్టర్ రాజకుమారి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ మున్సిపల్ టౌన్‌హాలును సందర్శించారు. ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

'విద్యార్థి బస్సులను సమయానికి నడపాలి'

ఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో విద్యార్థి బస్సులను విద్యార్థులకు ఉపయోగ పడే సమయ వేళల్లో నడపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్ కుమార్, సాయిప్రశాంత్ కోరారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో అధికారులు ఆ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లా డుతూ.. సరైన సమయానికి విద్యార్థి బస్సులు అందుబాటులో లేకపోవ డంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు అంజి, వంశీ, భరత్, బాలాజీ తదితరులు ఉన్నారు.

'భూ సమస్యల పరిష్కారానికి కృషి'

బండిఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చిన్న లింగారెడ్డి, నాయకులు వడ్డు మధుసూధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మండల సర్వేయర్ పర్వీన్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని ఇస్కాలలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. డీఐవో ఉమాపతి, ఆర్ఎస్‌డీటీ సుప్రియ, మండలం సర్వేయర్ భాస్కర్, వీఆర్వోలు, పీఎస్‌లు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పి. లింగాపురంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, మండల సర్వేయర్ అతీఫ్, వీఆర్వో చంద్రశేఖర్‌నాయుడు, సర్పంచ్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి: నందికుంట సచివాలయ ఆవరణలో రెవెన్యూ గ్రామసభను సర్పంచ్ నిత్యలక్ష్మీదేవి అధ్యక్షత నిర్వహించారు. డీటీ పెద్దన్న, జడ్పీటీసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ బాలరాజు, వీఆర్వో కృష్ణారెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని దుర్వేసిలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, టీడీపీ నాయకులు కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయాలి

పాములపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం పాముల పాడులో ధనలక్ష్మి మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో వయోజన విద్య ఆధ్వర్యంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాలలో నిరక్షరాస్యులను గుర్తించి వారి జాబితాను ఏపీఎంకు అందించాలని సూచించారు. మహిళల చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఏపీఎం ఉమామహేశ్వరి అన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షణ అధికారి శ్రీనివాసులు, ఎంఈవో-2 సుహాసిని, ఐసీడీఎస్, సీసీడబ్ల్యూ, వీవోఏలు పాల్గొన్నారు.

'కార్మిక సమస్యలు పరిష్కరించాలి'

పగిడ్యాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని బుధవారం పగిడ్యాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను రూపొందించిన పాలక ప్రభుత్వాలు నిధులను కేటాయించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగి అంగవైకల్యం ఏర్పడితే ప్రభుత్వం ఆదుకోవాలని, కార్మికులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

'యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు'

ఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని ఆత్మకూరు అర్బన్ సీఐ ఓబులేసు సూచించారు. బుధవారం పీసీపీఎన్‌డీటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదిత్యా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రోజుల్లో నకిలీ యాప్స్‌లోన్లతో ఎంతో మంది ఇబ్బందులకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భ్రూణహత్యలు, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాల గురించి వివరించారు. వైద్యులు పవన్‌కుమార్, సాజిదాఫిర్దోస్, అడ్వకేట్ శ్రీధర్ అడిగ, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, మెరిబా సంస్థ ప్రతినిధి జుల్ఫికర్, కళాశాల ప్రిన్సిపల్ విజయభాస్కరనాయుడు తదితరులు ఉన్నారు.

భూసారం ఆధారంగా సాగు చేపట్టాలి: డీఏవో



ఎర్రగుంట్లలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏవో

బండిఆత్మకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లో భూసారం ఆధారంగా పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. బుధవారం ఎర్రగుంట్ల గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామంలో పొగాకు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనవసరంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడొద్దని, ఖర్చులు తగ్గించాలని కోరారు. ఏడీఏ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'



మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ జయలక్ష్మి

మహానంది, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అసోసియేట్ డీన్ జయలక్ష్మి అన్నారు. మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో దీక్షారంభ్ కార్యక్రమాన్ని అసోసియేట్ డీన్ జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం వ్యవసాయ కళాశాలలో మెదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం(దీక్షారంభ్)లో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం గౌరవ ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మిదేవి మెదటి సంవత్సరం విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు విద్యార్థులకు వ్యవసాయ విద్య, ఉపాధి గురించి తెలియజేశారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి. జయలక్ష్మి విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. కళాశాలలో ఉన్న సౌకర్యాల గురించి తెలిపారు. శాస్త్రవేత్తలు ఎల్. విజయభాస్కర్, స్వరాజ్యలక్ష్మి, సుబ్బరామిరెడ్డి, నారాయణరావు, శ్రీనివాసరెడ్డి, మాధవి, మల్లేశ్వరరెడ్డిల, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు

పగిడ్యాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లీశ్వరి ఆధ్వర్యంలో బుధ వారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న సరుకులు పక్కదారిపడుతున్నాయని, అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ పుల్యాల దివ్య డిమాండ్ చేశారు. ఎంఈవో కార్యాలయ సమీపంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ప్రజాప్రతినిధులు గతంలో తీర్మానించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేతిపంపు బోర్లు మరమ్మతులకు గురైతే వాటికి మరమ్మతులు చేపట్టేందుకు మెకానిక్‌లు లేరని, సమస్యను పరిష్కరించకపోవడంతో ఒక్కొక బోరుకు రూ.2000 పైగా ఖర్చు చేసి మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తోందని చెప్పారు. కొన్ని గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయకపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని, దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వైస్ ఎంపీపీ అరుణమ్మ, కోఆప్షన్ మెంబరు అస్లాం బాషా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో బాల్య వివాహల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు సూచించారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, సీడీపీవో కోటేశ్వరమ్మ, ఎంఈవో సుభాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

వ్యక్తిపై దాడి

మిడుతూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీరుసాహేబ్ పేట గ్రామంలో బుధవారం రాత్రి సచివాలయం వద్ద సంపంగి రామ శ్రీధర్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పాతకక్షలు మనసులో పెట్టుకుని సంపంగి రామ శ్రీధర్ అనే వ్యక్తిపై సచివాలయం వద్ద అదే గ్రామానికి చెందిన రామకృష్ణ, వెంకటరమణ, మధుకుమార్, మధు మోహన్, మధుగోపాల్, మద్దిలేటి, సుబ్బమ్మ ఘర్షణ పడి చేతులు, రాళ్లతో, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటను సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్న సంపంగి శివకృష్ణపై కూడా దాడి చేశారు. రామ శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలిశికారి కాలనీలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్‌శాఖ, పోలీసుశాఖ అధికారులు ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1000 లీటర్ల సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను ధ్వంసం చేయగా, 45 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసి అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ చట్టాన్ని ప్రయోగిస్తామని ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, కుమారి, కానిస్టేబుళ్లు శివన్న, సుధీర్, మధుప్రసాద్, సంధ్యారాణి, నందికొట్కూరు టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

పగిడ్యాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి 28 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీలకు నెహ్రూనగర్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం శేఖర్ తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మహేష్, ఎస్.షెహనాజ్ ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నరసింహ, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస రెడ్డి, పీడీ చంద్రమోహన్ ఉన్నారు.

ఖోఖో పోటీలకు..



జ్యోతి

గడివేముల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గని హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని జ్యోతి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమామ్‌వలి తెలిపారు. క్రీడాకారిణి జ్యోతిని హైస్కూల్ హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

'నియంతలా వ్యవహరిస్తున్న ఏడీఏ'

నంద్యాల రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు జాన్సన్ నియంతలా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకుడు గౌస్ ఆరోపించారు. బుధవారం ఆర్ఏఆర్ఎస్ పనిచేస్తున్న కూలీలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్ఏఆర్ఎస్ ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, గౌస్ మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా లేని పద్ధతిని కొత్తగా వచ్చిన ఏడీఆర్, సూపరింటెండెంట్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. కూలీల మస్టర్‌ను గేటు లోపల తీసుకోకుండా బయటనే తీసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. మస్టర్‌ను గేటు లోపల తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నగదు ప్రోత్సాహకాల పంపిణీ

ఆత్మకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో గత ఆగస్టు నెలలో ఉత్తమంగా రాణించిన ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం డిపో మేనేజర్ మహేంద్రుడు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు -2024 నెలకు సంబంధించి అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్లు పి. సరస్వతి, ఈఎస్ లక్ష్మి, డీబీ నాయక్, ఎంజే రావు, ముర్తుజాబీ, డీజే నాయక్, కె. నాగన్న, ఎన్‌వీ నాయక్, జీఆర్ఎల్ రెడ్డికి నగదు పోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు దర్గయ్య, కలీముల్లా, ఎస్‌కే.వలి, ఎ. ఓబులేసు, ఖమ్మద్దీన్, జీవీ రమణకు కూడా అందజేశారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

పాణ్యం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీలో బుధవారం శాంతిరాం వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలోని 200 మంది బాలికలకు ఉచితంగా రక్త పరీక్షలు, వైరల్, మలేరియా, జ్వరాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కె.సురేష్, డాక్టర్ బి. సురేష్, పాఠశాల మేనేజరు లలిత, శాంతిరాం వైద్యశాల సిబ్బంది వైవీ రమణ, ఎం.మూర్తి, వైసుబ్రహ్మణ్యం, శ్రీసురేంద్ర, అఖిల్, పవన్ పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని పూర్తి చేయాలి'

కొత్తపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో వేతనదారులకు కల్పించాల్సిన పనిదినాల లక్ష్యాన్ని ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ పూర్తి చేయాలని, వారితో పని పూర్తి చేయించే బాధ్యత మండల స్థాయి అధికారులు తీసుకోవాలని ఎంపీడీవో మేరీ అధికారులను సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మేరీ అధ్యక్షత న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీవో హరికృష్ణ, ఐటీడీఏ ఏపీవో రాజునాయక్, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ లక్ష్యం'



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీపీటీవో రజియాసుల్తానా

కోవెలకుంట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ ఎల్లవేళలా కృషి చేస్తుందని నంద్యాల జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి రజియా సుల్తానా పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్‌ను ఆమె తనిఖీ చేశారు. ఆర్టీసీ డిపోతో పాటు బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థను తనిఖీ చేశారు. ప్రయాణికులు బస్టాండ్‌లోని సమస్యలను ఆమెకు తెలియజేశారు. డిపో మేనేజరు తిరుపతయ్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'పేదల సంక్షేమానికి కృషి'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల)/దొర్నిపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు రూ.3.71 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆళ్లగడ్డలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమె బుధవారం పంపిణీ చేశారు. ఇందులో ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామానికి చెందిన తలారి రామసుబ్బమ్మకు రూ.90 వేలు, దొర్నిపాడు మండలం చాకరాజవేముల గ్రామానికి చెందిన చేకూరి శకుంతలకు రూ.81 వేలు, ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరుకు చెందిన కర్రా హర్షిత్‌రెడ్డికి రూ.2 లక్షల చెక్కును అఖిలప్రియ అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌నాయుడు, గోపాల్‌నాయుడు, భూమా ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ వరప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతిగది పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనలో గాయపడిన విద్యార్థులకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అఖిలప్రియ.. విద్యార్థిని శ్వేతకు నంద్యాలలోని ఓ వైద్యశాలలో ఉచితంగా సీటీ స్కాన్, వైద్య పరీక్షలు జరిపించినట్లు ఆమె తల్లిదండ్రులు బుధవారం తెలిపారు. ఆపద సమయంలో సహకారం అందించిన ఎమ్మెల్యే అఖిలప్రియకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన భవనం నిర్మాణానికి చర్యలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని, కలెక్టరుతో చర్చించి అవసరమైన నిధులను సమాకూరుస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు. పెచ్చు లూడి గాయపడిన విద్యార్థిని శ్వేతను అఖిలప్రియ పరామర్శించి ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడారు.

అన్నప్రసాదశాల ప్రారంభం



అన్నప్రసాదశాలను ప్రారంభిస్తున్న భార్గవ్‌రామ్ నాయుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో(కాశింతల) ఉత్తర శబరిమల అయ్యప్ప స్వాముల కోసం అన్నప్రసాదశాలను ఏర్పాటు చేశారు. దీన్ని ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ నాయుడు బుధవారం ప్రారంభించారు. క్షేత్రానికి చేరుకున్న భార్గవ్‌రామ్ నాయుడుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కాశీవిశ్వేశ్వర స్వామికి, ఉత్తర శబరిమల అయ్యప్ప స్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'రైతులకు న్యాయం చేయండి'

డోన్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో రైతులకు జరిగిన నష్టాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామసభల ద్వారా రైతులకు రెవెన్యూ అధికారులు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో రైతులతో కలిసి ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పలు గ్రామాల్లో హడావుడిగా చేసిన భూముల రీసర్వేలో అనేక మంది రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో గల్లంతయ్యాయని అన్నారు. దీంతో ఆ రైతులు పంట రుణాలను కూడా రుణాలు అందక తీవ్రంగా నష్టపోయారని అన్నారు.

తిమ్మనాయునిపేటలో పర్యటన



తిమ్మనాయునిపేటలో పర్యటిస్తున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, మాజీ ఎమ్మెల్యే కాటసాని

కొలిమిగుండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనాయునిపేట, మదనంతపురం గ్రామాల్లో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం పర్యటించారు. మదనంపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా తిమ్మనాయునిపేటలో కార్యకర్తలతో ప్రత్యేకంగా చర్చించారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన



చాగలమర్రిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో విద్యార్థులకు బ్యాంకు సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. స్థానిక జడ్పీ బాలుర హైస్కూలులో వృత్తి విద్య శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఇండస్ట్రియల్ ఇండస్ విద్యా శిక్షణలో భాగంగా శిక్షకులు బాలయ్య ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి బ్యాంకును సందర్శించారు. బ్యాంకు మేనేజర్, సిబ్బంది బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, మాబాషా, శ్రీనివాసులు, మధురిమ, కుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా పోలీసు క్వాటర్స్

దెబ్బతిన్న గదుల పైకప్పులు, గోడలు



శిథిలావస్థకు చేరకున్న పోలీసు క్వాటర్స్



దెబ్బతిన్న కిటికీలు

ప్యాపిలి, అక్టోబరు 23: పట్టణంలో పోలీసు క్వాటర్స్ నిరుపయోగంగా మారింది. శిథిలావస్థకు చేరకున్న భవనాలను పట్టించుకొనే నాథులే కరువయ్యారు. దీంతో అధ్వాన స్థితిలో ఉన్న ఈ భవనాల్లో ఉండలేక పోలీసు కుటుంబాలు బాడుగ ఇళ్లల్లో ఉంటున్నారు. పట్టణంలో రెండు దశాబ్ధాల క్రితం పోలీసు క్వాటర్స్‌ను నిర్మించారు. స్థానిక సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలోనే ఈ భవనాలను నిర్మించారు. అప్పట్లో దాదాపు రూ.15లక్షలు వెచ్చించి 8 భవనాలను నిర్మించారు. భవనాలు సుందరంగా ఉండటంతో పోలీసు కుటుంబాలు క్వాటర్స్‌లోనే నివాసం ఉండేవి. అయితే కొంత కాలం తర్వాత ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. పెచ్చులూడి పడుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పోలీసు కుటుంబాలు క్వాటర్స్‌ను ఖాళీ చేసి బాడుగ ఇళ్లల్లో నివాసముంటున్నారు. ప్రస్తుతం 10ఏళ్లుగా క్వాటర్స్ భవనాలు నిరుపయోగంగా మారాయి. గతంలో పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులకు, ప్రభుత్వాలకు క్వాటర్స్ గురించి చెబుతున్నా పట్టించుకోవడం లేదని పోలీసు వర్గాలు తెలియజేస్తున్నాయి.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ: ఎమ్మెల్యే



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

శిరివెళ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. అర్జీదారుల సమస్యలను సంబంధిత శాఖ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ పుష్పకుమారి, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఖాజా హుసేన్, ఫిదా హుసేన్, అజీస్, మోహన్‌రెడ్డి, బాలచంద్రుడు, శ్రీనివాసులు, వెంకట సుబ్బయ్య, కరీం, శ్రీనివాసరెడ్డి, జయరామిరెడ్డి, లక్ష్మీరెడ్డి, నాగేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: గుండుపాపలలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సుభద్ర, టీడీపీ నాయకులు కాశీవిశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, బుజ్జి, మల్లేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, మండల సర్వేయర్ నాగప్రసాద్, వీఆర్వో మురళీ తదితరులు ఉన్నారు.

రుద్రవరం: చిన్నకంబలూరులో గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: బెలుంశింగవరంలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ సరిత, వీఆర్వో నారాయణరెడ్డి, రెవిన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు డి.శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్, నాగేశ్వరరెడ్డి, పెద్ద రామసుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మార్పీస్ కృష పాల్గొన్నారు.

అవుకు: చెన్నంపల్లెలో గ్రామ సభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఆర్‌ఐ వెంగళరెడ్డి, సర్వేయర్ హరికృష్ణ, వీఆర్వో ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సంజామల: ఎగ్గోనిలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఆర్ఎటీటీ తులసీకృష్ణ, కమ్యూనిటీ సర్వేయర్ కృష్ణయ్య, మండల సర్వేయర్ మల్లేశ్వరీ, సర్పంచ్ అశ్వద్ అలీ ఖాన్, విలేజ్ సర్వేయర్ మస్తాన్, వీఆర్వో గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: అంబాపురంలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వే డీటీ మహేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్, వీఆర్వో వెంకటేశ్వర్లు, విలేజ్ సర్వేయర్ జయలక్ష్మి, సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, వీహెచ్‌ఏ సుధాకర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని మాధవరంలో బుధవారం రెవెన్యు గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు భారతి, రెవెన్యు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'కూరగాయల షాపుల అద్దె తగ్గించాలి'

డోన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లోని షాపుల అద్దె తగ్గించాలని పలువురు వ్యాపారులు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ను కోరారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజేష్‌కు పలువురు వ్యాపారులు వినతి పత్రం అందజేశారు. కూరగాయల మార్కెట్‌లోని షాపుల అద్దెలు ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. మార్కెట్ లోపల ఉన్న షాపుల కొలతల ప్రకారం రూ.5వేలు ఉండాలని, అలా కాకుండా రూ.12వేలు అద్దె ఉండటంతో నష్టపోతున్నామని తెలిపారు. అదే విధంగా కూరగాయల మార్కెట్ బయట ఉన్న షాపుల అద్దెలు రూ.18,500 ఉన్నాయని, వాటి అద్దెలు కూడా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, రమణ పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని 40వ జాతీయ రహదారిలోని కూలూరు రస్తా సమీపంలో బుధవారం లారీ బోల్తా పడింది. చెన్నై నుంచి తెలంగాణలోని షాద్‌నగర్‌కు బొగ్గు లోడుతో వెళ్తున్న ఏపీ39టీఎఫ్2328 నంబర్‌గల లారీ కూలూరు రస్తా సమీపంలోకి రాగానే అదుపు తప్పి ప్రమాదవశాత్తు బోల్తాపడి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మురుగన్‌కు గాయాలు అయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ డ్రైవర్‌ను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. పోలీసులు ప్రమాద సంఘటనపై విచారణ చేపట్టారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

డోన్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టిందని, రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ అన్నారు. ఉడుములపాడు, దొరపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉయ్యాలవాడకు ఎమ్మెల్యే

ఉయ్యాలవాడ, అక్టోబరు 23(ఉయ్యాలవాడ): ప్రజా సమస్యల పరిష్కారానికి గురువారం ప్రజల నుండి అర్జీలు స్వీకరించేందుకు ఉయ్యాలవాడకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బీసీఎస్సార్ స్కూలు సమీపంలో ఉన్న గోల్డెన్ ఫంక్షన్‌హాలులో మధ్యాహ్నం 2 గంటలకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోపాయలపల్లె రహదారిలో అడ్డవాగు పొంగి నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా హుసేన్‌సా పక్రుద్దీన్, హుసేన్‌బాషా, రహంతుల్లా, మాబాషా మరి కొంత మంది రైతులు సాగు చేసిన మొక్కజొన్న, కంది, పంటలను పరిశీలించారు. వరదనీరు పంట పొలాల్లో నిల్వ ఉండటంతో మొక్కలు కుళ్లిపోయాయని అన్నారు. దీంతో పంట దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఏవోతో మొరపెట్టుకున్నారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి పరిహారం కోసం నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏవో అన్నారు.

'అక్షరాస్యత అందరి బాధ్యత'

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వయోజన విద్య మండల స్థాయి కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలో 1,000 మంది నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించాలని, 10 మందికి ఒక వలంటీరు చొప్పున కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో అనూరాధ, ఏపీఎం నాగమ్మ, సూపర్‌వైజర్ సుశీల, మండల కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు'

ప్యాపిలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్ రక్షసి వలన విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. కళాశాలలో విద్యార్థి, విద్యార్థునులు స్నేహభావంతో మెలగాలన్నారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, ఎస్‌ఐ మధుసూదన్, అధ్యాపకులు నవీన్‌పాటి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.6.59 లక్షల అవినీతి

● జరిమానా రూ.43,900



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

బేతంచెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2023-24 ఏడాదిలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి జరిగిన రూ.6.59 లక్షలను రికవరీ చేయాలని, రూ. 43,900 ఉపాధి సిబ్బంది జరిమానా చెల్లించాలని డ్వామా పీడీ జనార్దన్‌రావు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో 18వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ, ఎస్సార్ సామాజిక తనిఖీ బృందం ఆయా గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీని ఉపాధి సిబ్బంది చేసిన అవినీతి అక్రమాల పనులపై చదివి అధికారులకు వినిపించారు. 2023-24 ఏడాదిలో బేతంచెర్ల మండలానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద 1065 పనులకు రూ.10.66 కోట్ల పంచాయతీరాజ్ పనుల కింద 15 పనులకు రూ.17.91 కోట్లు మొత్తం రూ.12.45 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనుల్లో ఉపాధి సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడుతూ గ్రామాల్లో ఉపాధి కూలీలు పనులు చేయకుండానే పనులు చేసినట్లు బిల్లులు చేశారని శంకరాపురం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి కూతురు రాధిక ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉండగా ఆమె పనిని గోపాల్ రెడ్డి నిర్వహిస్తున్నాడని, సీతారామాపురం గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరాముడు, గ్రామ ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పర్యవేక్షణ లోపంతోనే అక్రమాలు జరిగాయని సామాజిక తనిఖీ బృందం అధికారులకు విన్నవించింది. ముఖ్యంగా ఏపీవో శేషన్న కార్యాలయానికి పరిమితం కావడంతో ఉపాధి పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమాలు జరిగాయని డ్వామా పీడీ జనార్దన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ బాలాజీనాయక్, సురేంద్ర కుమార్, ఏపీవో శేషన్న, మండల ప్రభుత్వ శాఖల అధికారులు, ఉపాది సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుపల్లె గ్రామానికి చెందిన చాకలి పుల్లమ్మ కుమారుడు చాకలి సుబ్బరాయుడుకు బుధవారం తన సొంత నిధులతో రూ.3వేలు బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పంపిణీ చేశారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా వారి దీన స్థితిని చూసి ప్రతి నెల రూ.3వేలు సొంత నిధులతో అందిస్తానని మాట ఇచ్చారు. ఆమాట ప్రకారం సొంత నిధులు వెచ్చించి గత ఐదు నెలలుగా బీసీ ఇందిరమ్మ చాకలి సుబ్బరాయుడు తల్లి పుల్లమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ఇందిరమ్మ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో వివిధ వృత్తి పనుల కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తూ మృతి చెందితే వారి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.లక్ష, గాయపడిన కార్మిక కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

మద్యం స్వాధీనం

రుద్రవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలూరు గ్రామంలో మద్యం సీసాలు ఉన్నట్లు సమాచారం అందడంతో బుధవారం దాడి చేసినట్లు ఎస్‌ఐ వర ప్రసాద్ తెలిపారు. ఈ దాడిలో కిశోర్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన జంగిటి వెంకటమణ అనే వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. 12 క్వార్టర్ మద్యం సీసాలు సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'వేగవంతం చేయాలి'

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగనన్న లేఔట్‌లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాలకు 90 రోజుల ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఏవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ ఏఈ నరసింహారావు, ఏపీవో నిర్మల టీఏలచే సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 25 లోపు అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేయాలని అన్నారు. 2,316 గృహాలు మంజూరయ్యాయని, చాగలమర్రిలో 361 గృహాలు పూర్తయ్యాయని, 851 గృహాలు బేస్‌మెంట్ లేవెల్‌లో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సహాయ అధికారులు ఓబులేసు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

'విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలి'

చాగలమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలని ఎంఈవో అనూరాధ తెలిపారు. బుధవారం మండలంలోని శెట్టివీడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలని, నాణ్యతగల భోజనం, కోడిగుడ్లు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు.

ట్రాక్టర్లు మంజూరు

కొలిమిగుండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరైనట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి బుధవారం వెల్లడించారు. కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె గ్రామ పంచాయతీలకు చెత్త తరలింపు కోసం ప్రభుత్వం ట్రాక్టర్లను మంజూరు చేసినట్లు తెలిపారు. కొలిమిగుండ్ల సర్పంచ్ జినుగు శివరాముడు, కనకాద్రిపల్లె సర్పంచ్ శివశంకరుడు నంద్యాల జిల్లా కేంద్రం నుంచి ట్రాక్టర్లను గ్రామ పంచాయతీలకు తీసుకువచ్చినట్లు తెలిపారు.

'లైసెన్స్ తప్పనిసరి'

బనగానపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వాహనదారులందరికీ తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని నేషనల్ హైవే అథారిటీ అధికారి ప్రమోద్ జోషి అన్నారు. బుధవారం బనగానపల్లెలోని స్థానిక కంకరగురెడ్డి కళాశాలలో విద్యార్థులకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌బల్లా, ప్రధాన్‌మేనల్, కళాశాల ప్రిన్సిపాల్ సదాశివమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రపంచ రికార్డులు హర్షణీయం'

బనగానపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్వహించిన డ్రోన్ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు 5 గిన్నిస్ వరల్డ్ అవార్డులు రావడం హర్షణీయమని నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు వంగల పరమేశ్వరరెడ్డి బుధవారం అన్నారు. ఈ సందర్భంగా శ్రీనయ్య కార్యాలయంలో వారు విలేఖర్లతో మాట్లాడుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డులు సృష్టించడం హర్షణీయమని, భవిష్యత్‌లో ఇలాంటి విజయాలు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, యాగంటిపల్లె దస్తగిరి, బాలరాజు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

అవుకు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అవుకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంగన్న బుధవారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు భవ నాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పశుసంవర్థక, రోడ్లు భవనాలు, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమం పలు శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందన్నారు.

కూలిన మట్టి మిద్దె

కొలిమిగుండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎస్సీ కాలనీలోని లక్ష్మీదేవి మట్టి మిద్దె కూలి పోయింది. కుమారుడితో కలిసి నివసిస్తున్న లక్ష్మీదేవి వర్షం పడుతుండటంతో ఇంటి బయట నిలబడి ఉండగా మిద్దె ఒక్కసారిగా కూలి పోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవ డంతో పెద్ద ప్రమాదం తప్పిందని కాలనీ వాసులు తెలిపారు. తనకు ఉన్న ఆధారం ఇల్లేనని, అది కూడా కూలి పోవడంతో నిరాశ్రయురాలినయ్యాయని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని లక్ష్మీదేవి విజ్ఞప్తి చేశారు.

'నిబంధనలు పాటించాలి'

రుద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎక్సైజ్ సీఐ క్రిష్ణమూర్తి తెలిపారు. బుధవారం రుద్రవరం, శిరివెళ్ల, గోస్పాడు, ఆళ్లగడ్డ పట్టణం, మండలంలో మద్యం దుకాణాలు పరిశీలించామ న్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పడకండ్లలోని కేవీజీ హైస్కూల్ విద్యార్థి కవీష్ విలువిద్య, సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో జరిగిన సాఫ్ట్‌బాల్, విలు విద్య పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థి కవీష్‌ను నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘం అధ్యక్షుడు అమీర్ బాషా, పాఠశాల పీఈటీ మనోహర్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

సంజామల: రాష్ట్రస్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు పేరుసోమల జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థినిలు ఎంపికైనట్లు హెచ్. ఎం సీతారావమ్మ బుధవారం తెలిపారు. ఈ నెల 22న కర్నూలులో జరిగిన ఖోఖో పోటీల్లో అండర్ - 14 విభాగంలో రుక్సానా, అండర్ - 17 విభాగంలో హర్షిత, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు మేడా హరిప్రసాద్ విజేతలను వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను అభినందించారు.

చాగలమర్రి: చాగలమర్రి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పీడీ దాదాపీర్ బుధవారం తెలిపారు. పదోతరగతి చదువుతున్న పండు, మనీషా, సమీరా అండర్-17 సాఫ్ట్‌బాల్‌లో హరి నరసింహ, సునీత అండర్-14 సాఫ్ట్‌బాల్‌లో సంకీర్తన, అండర్-17 విభాగంలో నవ్యశ్రీ, షాహిదా ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం కోటయ్య, సీనియర్ ఉపాధ్యాయులు, పీఈటీ భారతి అభినందించారు.

'దరఖాస్తు చేసుకోండి'

డోన్ రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఐటీఐలో 2024-25 విద్యాసంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ నెల 26న ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు.

గడువు పొడిగింపు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆళ్లగడ్డ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు సీడీపీవో తేజేశ్వరి బుధవారం తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో నల్లగట్ల-1(బీసీ-డీ), గుంప్రమాన్‌దిన్నె-2(బీసీ-ఏ), యర్రగుడిదిన్నె(ఓసీ)లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే పలు మండలాల్లోని గ్రామాల్లో 16 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఉన్నాయన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సూచించారు.

పోలీసు తనిఖీలు

ప్యాపిలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె గ్రామంలో బుధవారం కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున ఆధ్వర్యంలో పలువురు నేతల ఇంట్లో ఈ తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఇళ్లలో మారణాయుధాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.